క్లుప్తంగా

ట్రాక్టర్ అందజేత



ట్రాక్టర్ తాళం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా మంజూరైన రూ.13.5 లక్షల విలువ చేసే వ్యవసాయ ట్రాక్టర్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు గురువారం లబ్ధిదారుడు బాబాపూర్‌కు చెందిన సత్రవేణి రాజన్నకు అందజేశారు. రూ.9 లక్షలు బ్యాంకు రుణం అందజేయగా, మిగతా డబ్బు లబ్ధిదా రుడు జమ చేసినట్లు సింగిల్‌విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్ తెలిపారు. ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ రుకుం ప్రహ్లాద్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలి



జెడ్పీ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

ఆసిఫాబాద్: మండలంలోని మోతుగూడలో జాతీయ రహదారి విస్తరణలో కోల్పోయిన మోతుగూడ ప్రభుత్వ పాఠశాల ప్రహరీతో పాటు మరుగుదొడ్లు నిర్మించాలని కోరుతూ సర్పంచ్ సువర్ణ ఆధ్వర్యంలో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మికి గురువారం ఆమె నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో 4 టాయిలెట్లు, 4 మరుగుదొడ్లతోపాటు ప్రహరీ కోల్పోగా, కేవలం రూ.1.50 లక్షలు మాత్రమే డీబీఎల్ కంపెనీ చెల్లించిందన్నారు. ప్రస్తుత పరిస్థితిలో ఈ డబ్బుతో వాటిని నిర్మించడం సాధ్యం కాదన్నారు. పాఠశాలలో టాయిలెట్లు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కోవ లక్ష్మి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

వాంకిడి: తపాలాశాఖ ఆధ్వర్యంలో కల్పిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మార్వో తాజ్ముల్ హుస్సేన్ కోరారు. మండలంలోని బంబార గ్రామంలో పోస్టాఫీసుల ద్వారా అందిస్తున్న సేవలపై గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖ తీసుకువచ్చిన జీవితబీమా పథకాలతో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ప్రీమియం తక్కువగా ఉండి బోనస్ ఎక్కువ పొందవచ్చునని సూచించారు. కార్యక్రమంలో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు, లతీఫ్, చాందేకార్ సచిన్ పాల్గొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంపీటీసీలు

రెబ్బెన: రెబ్బెన నూతన ఎంపీడీవోగా శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పెంచికల్‌పేట్ నుంచి బదిలీపై ఇక్కడ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎంపీపీ సౌందర్య, వైస్ ఎంపీపీ సత్యనారాయణతో పాటు ఎంపీటీసీ సభ్యులు సన్మానించారు.

వారసంత, పశువుల సంత నిర్వహణకు వేలం

కౌటాల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో వారసంత, పశువుల సంతల నిర్వహణ కోసం గురువారం వేలంపాట నిర్వహించారు. సర్పంచ్ వొజ్జల మౌనిష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలంలో పలువురు వ్యాపారులు పాల్గొన్నారు. కౌటాలకు చెందిన కోడిపె పెంటయ్య రూ.5 లక్షలకు వారంతపు సంత దక్కించుకున్నాడు. రూ. 8.40 లక్షలకు పశువుల సంతను నేర్పల్లి అర్జున్ సొంతం చేసుకున్నాడు. ఈ వేలం ద్వారా గ్రామ పంచాయతీకి రూ.13.40 లక్షల ఆదాయం సమకూరింది. సమావేశంలో ఎంపీపీ విశ్వనాథ్, ఎంపీవో మౌనిక, ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి, కార్యదర్శి సాయికృష్ణ, కోఆప్షన్ సభ్యుడు అజ్మత్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

ఆసిఫాబాద్: విద్యార్థులు లక్ష్యంతో చదివి ప్రయోజకులు కావాలని జెడ్పీ ఉర్దూమీడియం పాఠశాల చైర్మన్ అబ్దుల్ హన్నాన్ అన్నారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పదోతరగతి విద్యార్థులకు పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయన్ను సన్మానించారు. హెచ్ఎం ఖాజా నిజామొద్దీన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ముందుకు సాగని ‘బడి’ పనులు

- ‘మన ఊరు మన బడి’ కింద రూ.2.90కోట్లు మంజూరు
- ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా మరో రూ.3 కోట్లు..
- మండలంలో మొత్తం 19 పాఠశాలల ఎంపిక
- సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



దహెగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పెండింగ్‌లో ఫ్లోరింగ్ పనులు

దహెగాం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చడంతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు -మన బడి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టింది. అయితే కిందిస్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని పాఠశాలల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయి.

మండలంలో 19 పాఠశాలల ఎంపిక..

మండలంలో మొత్తం 53 పాఠశాలలు ఉండగా, మన ఊరు మన బడి కింద 19 పాఠశాలలను ఎంపిక చేశారు. దహెగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, బీబ్రా, ఇట్యాల, రాళ్లగూడ, ఐనం, కల్వాడ, బొగుడగూడ, కుంచవెల్లి, చినరాస్పెల్లి, హత్తిని, అమరగొండ, చంద్రపల్లి, చౌక పాఠశాలలను కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేశారు. పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఏయే పనులు చేయాలో ముందుగానే ఇంజినీరింగ్ అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. దీని ఆధారంగా 19 పాఠశాలలకు మన ఊరు మన బడి కింద రూ. 2.90 కోట్లు, ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.3 కోట్లు నిధులు మంజూరయ్యాయి. పాఠశాలల్లో రూ.30 లక్షల వరకు ఉండే పనులు ఎస్ఎంసీ చేయాలని, అంతకుమించితే టెండర్లు పిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాని మండలంలో ఎస్ఎంసీ చైర్మన్‌లే పనులు చేస్తుండగా నత్తనడకన కొనసాగుతున్నాయి.

విద్యుత్ పనులు పూర్తి..

మండలంలోని 19 పాఠశాలల్లో ముందుగా కరెంట్‌కు సంబంధించిన పనులు పూర్తి చేశారు. అనంతరం ప్యాచ్‌వర్క్ మరమ్మతులు చేపడుతున్నారు. మన ఊరు మన బడి కింద పాఠశాలల్లో మరమ్మతులు, కరెంట్, తాగునీటి సౌకర్యం, డైనింగ్ హాల్, రంగులు వేయడం వంటి పనులు చేస్తున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద పాఠశాలలకు ప్రహరీలు, వంట గదులు, మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. అయితే పనులకు ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేయడంలో జాప్యం జరుగుతోందని, దీంతో పనులు ముందుకు సాగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. రూ.5.90 కోట్ల నిధులు మంజూరు కాగా ఇప్పటి వరకు చేసిన పనులకు కేవలం రూ.50 లక్షల వరకు బిల్లులు మాత్రమే చెల్లించినట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.



చివరి దశకు చేరుకున్న చంద్రపల్లి ప్రాథమిక పాఠశాల పనులు

పనులు వేగవంతం చేస్తాం

మన ఊరు మన బడి కింద మండలంలో 19 పాఠశాలలను ఎంపిక చేశాం. పనులు కొనసాగుతున్నాయి. రూ. 5.90 కోట్లతో పనులు చేపడుతున్నాం. ఇప్పటి వరకు రూ.50 లక్షల వరకు బిల్లులు చెల్లించాం. చంద్రపల్లి ప్రాథమిక పాఠశాలలో పనులు చివరి దశకు చేరుకున్నాయి. మిగతా పాఠశాలల్లో కూడా పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం.

– ఆత్మారాం, పీఆర్ ఏఈ

చంద్రపల్లిలో పనులు పూర్తి..

మండలంలోని చంద్రపల్లి ప్రాథమిక పాఠశాలలో పనులు చివరి దశకు చేరుకున్నాయి. పాఠశాలలో కరెంటు, రంగులు, కిచెన్‌షెడ్, మరుగుదొడ్లు, ప్రహరీ పనులు పూర్తయ్యాయి. ప్రహరీకి రంగులు వేయాల్సి ఉంది. ఈనెలాఖరులోగా మిగిలిన కొన్ని పనులు సైతం పూర్తి చేసి ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. చంద్రపల్లి ప్రాథమిక పాఠశాల మాదిరిగానే అన్ని పాఠశాలల్లో పనులు పూర్తి చేయడానికి జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

చింతలమానెపల్లి: పోషకాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ డుబ్బుల నానయ్య అన్నారు. మండలంలోని బాలాజీ అనుకోడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఎంపీపీతోపాటు, జెడ్పీటీసీ శ్రీదేవి పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. సర్పంచ్ సుజాత, ఉప సర్పంచ్ భాగ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, కార్యదర్శి మల్లికార్జున్, అంగన్‌వాడీలు శోభ పాల్గొన్నారు.

వాంకిడి: చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా పోషకాలు లభిస్తాయని సీడీపీవో రెబ్కా అన్నారు. పోషణ్ పక్వాడలో భాగంగా మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారికి వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ తౌఫిక్, సిబ్బంది పాల్గొన్నారు.

దహెగాం: ఇట్యాలలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూర్య మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. సర్పంచ్ మురారి, కార్యదర్శి సాయికుమార్, ఏఎన్ఎం పద్మ, అంగన్‌వాడీ కార్యకర్త రమాదేవి పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని దర్గాషరీఫ్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సిర్పూర్(టి) ప్రాజెక్టు సీడీపీవో విజయలక్ష్మి మాట్లాడుతూ చిరు ధాన్యాలు తీసుకోవడంతో పోషకాలు లభిస్తాయన్నారు. అనంతరం పోషకాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఎంపీటీసీ శైలజ, వార్డుసభ్యులు షభాన బాబు, ఇఫాత్ హుస్సేన్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు



దహెగాం పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు

రెబ్బెన: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై దర్యాప్తు చేస్తున్న సిట్ ఎదుట టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరైన నేపథ్యంలో మండలంలో ఎలాంటి అల్లర్లు చోటు చేసుకోకుండా పోలీసులు గురువారం కాంగ్రెస్ నాయకులకు ముందస్తుగా అరెస్టు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీలను అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేపర్ లీకేజీ వ్యవహారాన్ని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

తిర్యాణి: మండలంలో కాంగ్రెస్ నాయకులు, పలువురిని ఎస్సై రమేశ్ అదుపులోకి తీసుకున్నారు. మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్, యువజన అధ్యక్షుడు పున్నం హరీశ్, నాయకులు దురిశెట్టి సతీశ్, పులిశెట్టి రాజశేఖర్, పడిగల అమర్ తదితరులు ఉన్నారు

పెంచికల్‌పేట్: మండల పార్టీ నాయకులను ఎస్సై విజయ్‌కుమార్ ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. పార్టీ నాయకుడు, సర్పంచ్ చంద్రమౌళి, నాయకులు బాపూజీ, బండు, అతహర్‌బేగ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

దహెగాం: కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసినట్లు ఎస్సై సనత్ కుమార్ తెలిపారు. ఎల్క మోహన్, గందె వెంకటేశ్, తోగయ్య, దబ్బ రవి, జంపాల శ్రీను అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశామన్నారు.

ఆడపడుచులకు అండగా..



చెక్కులు అందజేసిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఆత్రం సక్కు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

ఆసిఫాబాద్: పేదింటి ఆడపడుచులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద మంజూరైన 117 మందికి మంజూరైన చెక్కులను జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ నిరుపేదల వివాహాల కోసం మేనమామ లాగా సీఎం కేసీఆర్ ఆర్థికసాయం అందిస్తోందన్నారు.ఎంపీపీ మల్లికార్జున్, జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు,ఏఎంసీ చైర్మన్ మల్లేశ్, సింగిల్‌విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో, ఎంపీటీసీలు, సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: ఆడబిడ్డ పెళ్లికి పెద్దన్న కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా కానుక అందజేస్తున్నారని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. రూ.2 కోట్ల 10లక్షల విలువ గల 210 చెక్కులు అందజేశారు. జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెబ్బెన: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు వరంలా మారాయని జెడ్పీటీసీ సంతోష్, ఎంపీపీ సౌందర్య అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేశారు. తహసీల్దార్ మల్లికార్జున్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, పీఏ సీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, సర్పంచులు అహల్యాదేవి, సుమలత, ఎంపీటీసీ హరిత, కోఆప్షన్ సభ్యుడు జహూరొద్దీన్, బీఆర్ఎస్ నాయకుడు మధునయ్య పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయసాధనకు కృషి



ఆసిఫాబాద్: భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



పెంచికల్‌పేట్: జిల్లెడలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యువకులు

ఆసిఫాబాద్: భగత్‌సింగ్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూభవన్‌లో భగత్‌సింగ్ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్‌తో కలిసి భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పార్టీ నాయకులు శంకర్, సుధాకర్, దుర్గం రవీందర్, మల్లేశ్, మోహన్‌బాబు, సత్తార్‌బేగ్ పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని బాలూర వసతి గృహంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 92వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం అజయ్ కుమార్, కోశాధికారి ప్రదీప్, జిల్లా మాజీ అధ్యక్షుడు దుర్వ శ్రీనివాస్, నాయకులు సాయినాథ్, బన్నీ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: స్వాతంత్ర్య ఉద్యమంలో తమ ప్రాణాలను త్యాగం చేసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యువకులు పిలుపునిచ్చారు. పెంచికల్‌పేట్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ, జిల్లెడ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. యువజన సంఘం అధ్యక్షుడు సతీశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్, ఉపాధ్యక్షుడు చిరంజీవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెబ్బెన: లేతన్‌గూడ పాఠశాలలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం రవికుమార్, ఉపాధ్యాయుడు సాయికృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలి



ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

ఆసిఫాబాద్: జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలని టీయూడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ డిమాండ్ చేశారు. ఐజేయూ పిలుపు మేరకు జిల్లాకేంద్రంలో గురువారం సేవ్ జర్నలిజం డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం రహమాన్ మాట్లాడుతూ రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను, భావప్రకటన స్వేచ్ఛను అడ్డుకోవడం సరైన విధానం కాదన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వేణుగోపాల్, అడప సతీశ్, బిక్కాజీ, రమేశ్, కృష్ణంరాజు, అబ్దుల్ హన్నాన్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యం చేరుకోవాలి

చింతలమానెపల్లి: కంటి వెలుగు కార్యక్రమంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి రాధిక అన్నారు. మండలంలోని బాబాపూర్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని గురువారం తనిఖీ చేశారు. వైద్యాధికారికి పలు సూచనలు చేశారు. పరీక్ష కేంద్రంలో ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని అన్నారు. వైద్యాధికారి అజ్మీర రాజ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

సర్పంచులకు అవార్డులు ప్రదానం



అవార్డులు అందజేస్తున్న జెడ్పీటీసీ సరిత

పెంచికల్‌పేట్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని మూడు పంచాయతీలకు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారాలు వరించాయి. ప్రథమ బహుమతి చేడ్వాయి, కొండపల్లి (ద్వితీయ), ఎల్కపల్లి (తృతీయ) పంచాయతీలుగా నిలిచాయి. 2020-21 సంవత్సరానికి గాను ఉత్తమ పంచాయతీ అవార్డులను ఎంపీడీవో కార్యాలయంలో జెడ్పీటీసీ సముద్రాల సరిత, ఎంపీడీవో గంగాసింగ్‌లతో కలిసి గురువారం ఆయా గ్రామాల సర్పంచులకు అవార్డులు అందజేశారు. సర్పంచులు కావ్య, సుజాత, చంద్రమౌళి, ఈశ్వరిబాయి, మధునయ్య, రాజన్న, ఎంపీటీసీ దూగుంట రాజన్న, మండల కోఆప్షన్ సభ్యుడు సాజీద్, పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, జావీద్, చంద్రశేఖర్, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ విజేత రాంబాయిగూడ



ట్రోఫీని అందజేస్తున్న జీఎం దేవేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో నిర్వహించిన ఆర్అండ్ఆర్ సెంటర్ల వాలీబాల్ టోర్నమెంట్‌లో రాంబాయిగూడ విజేతగా నిలిచింది. ఏరియా పరిధిలోని సాలేగూడ, రాంబాయిగూడ, గిన్నెధరి, ఒంటిమామిడి, చిర్రకుంట, దాంపూర్, చోపిడి, నర్సాపూర్, ఇంద్రానగర్, కేస్లాపూర్ ఆర్అండ్ఆర్ సెంటర్లకు చెందిన జట్లు పాల్గొన్నాయి. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఏరియా జీఎం దేవేందర్ హాజరై మాట్లాడారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల ప్రజల కోసం సంస్థ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అందులో భాగంగా పునరావాస కేంద్రాల్లోని యువకుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రతిఏటా వాలీబాల్ పోటీలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

ఫైనల్‌లో హోరాహోరీగా..

ఆర్అండ్ఆర్ సెంటర్ల టోర్నమెంట్‌లో 10 జట్లు పాల్గొనగా రాంబాయిగూడ, ఒంటిమామిడి జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో రాంబాయిగూడ జట్టు క్రీడాకారులు అద్భుత ఆటతీరును ప్రదర్శించడంతో ఒంటిమామిడి జట్టుపై విజయకేతనం ఎగురవేశారు. ఒంటిమామిడి జట్టు సెకండ్ ప్రైజ్‌ను సొంతం చేసుకున్నాయి. ఇరుజట్ల క్రీడాకారులకు జీఎం దేవేందర్ బహుమతులు అందజేశారు. ఎస్వోటూజీఎం గుప్తా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, సీనియర్ పర్సనల్ అధికారి కిరణ్‌కుమార్, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

రెబ్బెన: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఓడీఎఫ్ ప్లస్‌పై గురువారం అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలో పల్లె ప్రగతి, పారిశుద్ధ్య కార్యక్రమాలు కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. పల్లెలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ సంతోష్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అంజద్‌పాషా, స్వచ్ఛభారత్ జిల్లా కోఆర్డినేటర్ ఫణికుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

తెలంగాణ ఉద్యమ నాయకుల సమావేశం

కాగజ్‌నగర్‌టౌన్: 1969 తెలంగాణ ఉద్యమ నాయకుల సమావేశాన్ని పట్టణంలోని సంఘ భవనంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మాట్లాడారు. ఉద్యమకారుల తరఫున ప్రొఫెసర్ ననుమాస స్వామి ఆధ్వర్యంలో పెన్షన్, ఇళ్లు, వైద్యం ఇతర సౌకర్యాలు కల్పించాలని గత ఐదేళ్ల క్రితం హైకోర్టులో కేసు వేశామన్నారు. ప్రస్తుతం వాదోపవాదాలు విన్న కోర్టు ఉద్యమకారులకు అనుకూలంగా తీర్పు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రవూఫ్, మోతె రాజన్న, నారాయణగౌడ్, శాంతిలాల్, సయ్యద్ బిన్ మోసిన్, రమేశ్, కిషన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

ఆసిఫాబాద్: మండలంలోని తుంపెల్లి పంచాయతీలోని గుడెన్‌ఘాట్‌లో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అజ్మీర ఆత్మారాం నాయక్ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు బీజేపీలో చేరారు. ఖాండ్రే విశాల్, జయరాజ్, ఈదులవాడ గణేశ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

దహెగాం: మండలంలోని జెండాగూడ, తదితర గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జెండాగూడ గ్రామానికి వెళ్లేదారిలో ఉన్న ఒర్రెపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. సంతోష్‌గౌడ్, నాయకుడు సోను తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కౌటాల: తలోడి, కౌటాల గ్రామాల్లో ఇటీవల పలువురు మృతి చెందారు. బాధిత కుటుంబాలను గురువారం బీజేపీ నియోజకవర్గ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

సెగ్రిగేషన్ షెడ్డు పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: బారెగూడలో సెగ్రిగేషన్ షెడ్డును ఎంపీడీవో గౌరీశంకర్ గురువారం పరిశీలించారు. కార్యదర్శి విలాస్ ఉన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బెజ్జూర్: మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ పుష్పలత, ఎంపీపీ డోకే రోజారమణి వెంకన్నలు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హాజరై చెక్కులు అందజేస్తారని పేర్కొన్నారు.

నేడు వారసంత వేలం

చింతలమానెపల్లి: చింతలమానెపల్లి గ్రామ పంచాయతీ వారసంత వేలంపాట శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు కార్యదర్శి ఆసిఫ్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో పల్లకీ ఊరేగింపు

కౌటాల: మండలంలోని వీర్దండి సమీపంలోని పెన్‌గంగ నది ఒడ్డున గల బీర్య హనుమాన్ మందిర్ ఆధ్వర్యంలో గురువారం భక్తులు శ్రీరాముని పల్లకీని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అర్చకుడు మారుతి మహారాజ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పర్చాకే బండు పాల్గొన్నారు.

సన్మానం

ఆసిఫాబాద్: ఫొటో, వీడియోగ్రాఫర్స్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు హుస్సేన్‌ను జిల్లాకేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు సలీం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఫారెస్టు చెక్ పోస్టు వద్ద కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా ఆధ్వర్యంలో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహనదారులకు సరైన పత్రాలను పరిశీలించారు.

మురళీగూడలో వైద్యశిబిరం

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మురళీగూడ గ్రామంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 71 మందికి వైద్యసిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ రవిదాస్, ఏఎన్ఎం లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదివాసీ యువతకు అవకాశం ఇవ్వాలి

తిర్యాణి: ఏజెన్సీ ప్రాంతాల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిన నిర్వహించే ఉద్యోగ భర్తీలో ఆదివాసీ నిరుద్యోగ యువతకు అవకాశమివ్వాలని తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ అనంతరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం డివిజన్ అధ్యక్షుడు వెడ్మ భగవంత్‌రావు మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఆసుపత్రిలో ఇటీవల 18 మంది గిరిజనేతరులతో ఔట్ సోర్సింగ్ పద్ధతిన పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డు పోస్టులు నియామకాలు చేపట్టారన్నారు. ఇది ఐదో షెడ్యూల్‌లోని హక్కులను కాలరాయడమే అని అన్నారు. వాటిని వెంటనే రద్దు చేసి అర్హులైన గిరిజనులతో భర్తీ చేయాలన్నారు. లేకపోతే ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. తుడుందెబ్బ మండల అధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి తొడసం భాస్కర్, నాయకులు గుండం వెంకటేశ్, గేడం సోనేరావు, కోట్నాక గంగారాం తదితరులు ఉన్నారు.